క్లుప్తంగా

అమర అగ్నిమాపక సిబ్బందికి నివాళులు



అగ్నిమాపక సిబ్బంది కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న సాలూరు అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు

సాలూరు: అగ్నిమాపక శాఖలో పనిచేసి మరణించిన సిబ్బందికి సాలూరు అగ్నిమాపక అధికారి సుధాకర్‌రావు నివాళులు అర్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన అమరులైన అగ్నిమాపక సిబ్బంది కుటుంబాలతో స్మారక పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులైన సిబ్బంది సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఘనంగా అయ్యప్ప పుట్టిన రోజు వేడుకలు



పెదంకలాం అయ్యప్ప సన్నిధానంలో అన్నసంతర్పణ చేస్తున్న అయ్యప్ప భక్తులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో అయ్యప్ప సన్నిధానాల్లో అయ్యప్పస్వామి పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ మేరకు సీతానగరం కమలాతోటలో ఉన్న రెండు సన్నిధానాల్లో పంచలోహాలతో తయారుచేయించిన అయ్యప్ప మంటపం గుడి మెట్లపై జ్యోతులు వెలిగించి ఉత్సవాలు నిర్వహించారు. పెదంకలాంలో సన్నిధానంలో మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించి రాత్రి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సీతానగరం సన్నిధానంలో నాగరాజు శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప జన్మవృత్తాంత పూజలు, స్వామివారి మహిమలను వివరిస్తూ అభిషేకాలు, పూజలు జరిగాయి.

గ్రామాల్లో ఇంటింటి ప్రచారం

- పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ



ఇంటింటి ప్రచారం చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ

సాలూరు రూరల్: మండలంలోని నార్లవలస పంచాయతీ పెద్దవలస, బర్నికవలస, మూలవలస గ్రామాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ ఆదివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని పిలుపునిచ్చారు. ఇప్పుడు అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్న మనకు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణ మరే ఇతర ఏ నాయకుడికి లేదని స్పష్టం చేశారు. ఇంత సంక్షేమం అందించిన ఆయనకు అందరం రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో నార్లవలస పంచాయతీ సర్పంచ్ రామ్మూర్తి, పెదపదం మాజీ సర్పంచ్ చింతాడ భాస్కరరావు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరాకు చర్యలు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపా రు. తాగునీటి సరఫరాపై వివిధ పత్రికల్లో ప్రచురితమైన వార్తలపై ఆయన స్పందిస్తూ తాగునీటి సరఫరాకు ఇబ్బందులు రాకుండా నీటి సరఫరా పథకాలు, బోరు బావులకు వెంటనే మరమ్మతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని, పనులు పూర్తయిన వెంట నే తాగునీరు సరఫరా చేయనున్నట్లుస్పష్టం చేశారు.

ఎన్నికల సామగ్రికి పటిష్ట భద్రత

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికలో భాగంగా పాలకొండలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూంకు ఎన్నికల సామగ్రి ఆదివారం చేరుకుంది. వాటిని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి నేతృత్వంలో అధికారులు భద్రపర్చారు. అరుకు పార్లమెంట్, పాలకొండ సెగ్మెంట్‌కు సంబంధించి 287 పోలింగ్ కేంద్రాలకు రిజర్వు యంత్రాలతో కలుపుకుని 373 వీవీ ప్యాడ్స్, 343 బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్స్‌ను జిల్లా కేంద్రం నుంచి ఇక్కడకు చేర్చటం జరిగిందన్నారు. వాటిని పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, పోలీస్‌ల సమక్షంలో భద్రపరచి, స్ట్రాంగ్‌రూంకు సీల్ వేసినట్లు చెప్పారు. ఎన్నికల సామగ్రి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డీఎస్పీ జీవీ కృష్ణారావుకు ఆర్‌ఓ సూచించారు. ఇతరులను ఈ పరిసరాల్లోకి అనుమతించొద్దని స్పష్టం చేశారు. పీఓ వెంట పాలకొండ, సీతంపేట సహాయ రిటర్నింగ్ అధికారులు పి.వరహాలు, బలివాడ సాయి తదితరులున్నారు.



సాలూరు: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



పార్వతీపురం టౌన్: తారకరామా కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సీతానగరం: కాశీపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

అందరివాడికి ఘనంగా నివాళులు



మక్కువ: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ సర్పంచ్ వెంకటలక్ష్మి

- జిల్లాలో వాడవాడలా అంబేడ్కర్ జయంతి

సాలూరు/ పార్వతీపురంటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు ప్రతి ఊరువాడలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆ మహనీయుడిని స్మరించుకున్నారు. ఈ క్రమంలో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర సాలూరు పట్టణంలోని బంగారమ్మపేట, పీఎస్ బొడ్డవలస, పెద్దవీధి, చిన్నవీధి, రెల్లివీధి తదితర వార్డుల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్పీ చింతగడ దాస్, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, రాపాక మాధవరావు, గొర్లె మధుసూదనరావు, తేగల బలరాం, వెంకటరావు, పాలవలస మధుసూదన్, యశోదకృష్ణ, మజ్జి అప్పారావు, హరిబాలాజీ, సువర్ణమ్మ, లక్ష్మణరావు, సింగారపు ఈశ్వరరావు, పప్పల లక్ష్మణరావు, లింగాల దుర్గ, రాయప్ప, చిన్న, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రధాన రహదారి ఇందిరాకాలనీ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ మహనీయుడు, భారత రాజ్యాంగ సృష్టికర్త, పేద బడుగు బలహీన వర్గాలకు ఆరాధ్య దైవం ప్రపంచ విజ్ఞాన వ్యక్తి అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని మనమందరం నిర్వహించుకోవడం నిజంగా చాలా గొప్ప విషయమన్నారు. ఆయన చూపిన దారిలో మనమందరం నడిచి భవిష్యత్ తరాలకు అంబేడ్కర్ అందించిన ఫలాలను మనమందరం చేరవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



సీతానగరం: హడ్కోకాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న పుచ్చల బ్రదర్స్



బలిజిపేట: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన సీపీఎం నాయకులు



సీతానగరం: లచ్చయ్యపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్, జెడ్పీటీసీ



సీతానగరం: చినభోగిలిలో మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న న్యాయవాది కృష్ణ



సాలూరు రూరల్: అంబేడ్కర్ జయంతి సమావేశంలో మాట్లాడుతున్న చింతగడ దాస్

సంక్షేమ పథకాలు అందాలంటే జగనే రావాలి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పట్టణంలోని 11 వార్డులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: సంక్షేమ పథకాలు మళ్లీ అందాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ఎన్నిక కావాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని 11వ వార్డు, మండలంలోని రావికోన గ్రామంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెల 13న జరగనున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. చంద్రబాబు మాయమాటలు నమ్మవద్దని, గత టీడీపీ పాలనలో జరిగిన అరాచకాలను గుర్తుకు తెచ్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, 30 వార్డుల కౌన్సిలర్‌లు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ మజ్జి శోభారాణి వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, బంకురు రవికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టణంలో మేమంతా సిద్ధం

ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీఅని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలోని 2, 3, 4, 28 వార్డుల నాయకులతో మేమంతా సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. వేలాది మందితో నిర్వహించిన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించిందన్నారు. అభివృద్ధిలో పరుగులు పెట్టించిందన్నారు. పేదల సంక్షేమానికి సీఎం జగనన్న అగ్ర తాంబూలం ఇవ్వడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్పర్సన్‌లు కొండపల్లి రుక్మిణ, యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, మంత్రి ఉమామహేశ్వరి, 30వార్డుల కౌన్సిలర్‌లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరంలో ప్రచారం

సీతానగరం: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా 58 నెలల్లో జగనన్న ప్రభుత్వం చేసిన మేలును, అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు ప్రభుత్వాన్ని ఏర్పాటు అవకాశం కల్పించేందుకు ఫ్యాన్ గుర్తుకు వేసి ఓట్లు వేసి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. 2914 సాధారణ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సీతానగరం మండలంలోని పెదభోగిలి పంచాయతీ సుంకరివీధి, కమలాతోటకాలనీల్లో మండల నాయకులతో కలిసి ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములు నాయుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.జయమణి, స్థానిక నాయకులు రౌతు అప్పారావు, రామారావు, న్యాయవాది ఆర్.వెంకటరమణ, పెదభోగిలి, సీతానగరం ఎంపీటీసీలు బి. కుసుమ, ఎస్.గౌరి, పార్టీ మండలనాయకులు కె.రత్నాకర్, పార్థసారథి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కజొన్న కూడిక పనుల్లో రైతులు



లక్ష్మీపురంలో జొన్నపంటను యంత్రాలతో నూర్పు చేస్తున్న రైతులు

సీతానగరం: మండలంలోని పొలాలోల మొక్కజొన్నపంట సాగు చేయడం, పంట కోతకు రావడంతో జొన్నగింజలు నూర్పిడి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌సీజన్‌లో సాగుచేసిన వరిపంట కోత అనంతరం జీరో టిల్లేజ్ విధానం ద్వారా మొక్క జొన్నపంట సాగుచేపట్టారు. ఈ క్రమంలో పంట కోతకు సిద్ధం కావడంతో ప్రభుత్వం రాయితీపై సమకూర్చిన యంత్రాలతో కండెలనుంచి గింజలు వేరు చేస్తున్నారు. మొక్క జొన్నపంట సాగు విషయమై ఏఓ ఎస్.అవినాష్ మాట్లాడుతూ మండలంలోని బుడ్డిపేట, లక్ష్మీపురం, చెల్లంనాయుడువలస, చినభోగిలి, తామరఖండి అప్పయ్యపేట, బక్కుపేట, గెద్దలుప్పి, పణుకుపేట గ్రామాల రైతులు జీరో టిల్లేజ్ విధానం ద్వారా తక్కువఖర్చుతో 360 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేపట్టారని తెలిపారు. ఎకరాకు 11 క్వింటాళ్ల దిగుబడి రావచ్చని చెప్పారు. జొన్నగింజల కొనుగోలు కేంద్రాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని రైతులు కోరడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

మంచిచేసే నాయకుడిని మళ్లీ గెలిపించండి

- ఎ.వెంకంపేటలో మావుడి సోదరుల ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మావుడి సోదరులు

మక్కువ: మంచిచేసే నాయకుడిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని ఎ.వెంకంపేట, కన్నంపేట గ్రామాలలో ఆదివారం సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని వారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర, ఎంపీ అభ్యర్థి తనుజారాణిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమపథకాలు అందించారని గుర్తు చేశారు. అటువంటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసే బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎ.వెంకంపేటలో చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డి శ్రీధర్, పెంట కిశోర్, దొడ్డి రమణమ్మ, దొడ్డి హైమావతి, దొడ్డి రామకృష్ణ, బలగ మధుసూదన రావు, పెంట సంజీవునాయుడు, రెడ్డి కృష్ణంనాయుడు, తేలు శ్రీరాములునాయుడు, చప్ప సూర్యనారాయణ, బురిడి చిన్నారావు, కొత్తూరు శంకర్రావు, పొన్నాడ కృష్ణ, పువ్వల పకీరునాయుడు, బత్తుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న గ్రామస్తులు

మెరిసిన మోడల్ కళాశాల విద్యార్థులు



వసంత (సీఈసీ) వసంత (బైపీసీ) చర్మిత కార్తీక్ క్రాంతి చాందిని

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడల్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మెరిశారు. 53మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా, 52మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరం 77మంది రాయగా, అందరూ ఉత్తీర్ణలయ్యారన్నారు. ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూపులో టి.వసంత 355 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. అలాగే ఫస్ట్ బైపీసీలో టి.వసంత 419మార్కులు, ఫస్ట్ ఎంపీసీలో సీహెచ్.చర్మిత 455 మార్కులు, ఫస్ట్ ఎంపీసీలో కె.కార్తీక్ 455 మార్కులు, సెకెండ్ బైపీసీలో బి.క్రాంతి 944 మార్కులు, సెకెండ్ ఎంపీసీలో చాందిని 967 మార్కులు సాధించి మోడల్ కళాశాల టాపర్లుగా నిలిచారు. ఈ మేరకు ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్ స్వర్ణలత, అధ్యాపకులు అభినందించారు.

ముఖ్యమంత్రిపై దాడి అమానుషం



రెడ్డి పద్మజ

సాలూరు రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై జనం చూపిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని ప్రత్యర్థులు జగన్‌మోహన్ రెడ్డిని అంతమొందించడానికి చేసిన కుట్ర అమానుషమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఏవిధంగానూ ఎదుర్కొలేక ఇలాంటి దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు పన్నినా ప్రజాభిమానం ఉన్నంతవరకు తమ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కోవడం ఎవరితరం కాదన్నారు.

దుర్గమ్మ సేవలో న్యాయమూర్తి



కోటదుర్గమ్మ దేవస్థానంలో పూజలు చేస్తున్న న్యాయమూర్తి కుటుంబ సభ్యులు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం కోటదుర్గమ్మను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ న్యాయమూర్తి ఎస్.ఎం.ఫణికుమార్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఈఓ మురళీకృష్ణ, ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీప్రసాద్ శర్మ వారికి సాదర స్వాగతం పలికారు. దగ్గరుండి పూజా కార్యక్రమాలు చేయించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సీఎం జగన్‌పై దాడి హేయం



పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో శనివారం రాత్రి జరిగిన దాడి అమానుషమని, పిరికిపంద చర్య అని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. చినమేరంగిలోని తన నివాసంలో ఆదివారం మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇటువంటి హేయమైన చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. కుట్ర, కుతంత్రాలతో చేసే రాజకీయాలకు మనుగడ ఉండదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సభలకు వస్తున్న జనాలను చూసి కూటమి నేతలకు ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఈ చర్యకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. దోషులను, వారిని ప్రేరేపించిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గుమ్మలక్ష్మీపురం: ఓటమి భయంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్షాలు దాడి చేయించాయని వైఎస్సార్‌సీపీ స్టేట్ యూత్ వింగ్ కమిటీ జాయింట్ సెక్రటరీ నిమ్మక గోపాల్ అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు.

60 లీటర్ల సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ పొలిమేరల్లో నిర్వహిస్తున్న సారా బట్టీలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. 60 లీటర్ల సారా పట్టుకున్నట్టు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. అలాగే 180 లీటర్ల పులిసిన బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్టు చెప్పారు. నిందితులు పరారీలో ఉన్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ రూరల్: పట్టణంలో యాలాం కూడలి వద్ద 11 కేవీ టౌన్ ఫీడర్-1లో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు సోమవారం చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు స్థానిక శ్రీనివాస, సీఎల్.నాయుడు, ఎంఎం.నగర్‌లతో పాటు చిన్న, పెద్ద కాపువీధులు, దేవరపేట, కోమటిపేట, పెదకాపువీధి, వెంకమ్మపేట, శ్రీకాకుళం, సీతంపేట రహదారుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

పాలకొండ రూరల్: అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం వారోత్సవాలను ప్రారంభించారు. విధి నిర్వహణలో అసువులుబాసిన సిబ్బందికి నివాళులర్పించారు. వారం రోజుల పాటు వివిధ గ్రామాల్లో అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అనుకోని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే 08941-260111 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.